ఫీవర్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం రేపు

బర్కత్‌పుర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ప్రజా విజయోత్సవాల సందర్భంగా ఈనెల 9వ తేదీన ఫీవర్ ఆస్పత్రిలో రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రాజేంద్రప్రసాద్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉస్మానియా ఆస్పత్రి సహకారంతో సోమవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఆస్పత్రి ప్రాంగణంలో ఈ రక్తదాన శిబిరం కొనసాగుతుందని తెలిపారు. రక్తదానం చేసే వారు ముందుకొచ్చి రోగుల ప్రాణాలను కాపాడాలని ఇన్‌చార్జి సూపరింటెండెంట్ కోరారు.


బ్రాహ్మణ సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి శ్రీధర్‌బాబు

బ్రాహ్మణుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

నల్లకుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో బ్రాహ్మణుల అభివృద్ధి, సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. శనివారం మంత్రి కార్యాలయంలోని ఆయన ఛాంబర్‌లో తెలంగాణ బ్రాహ్మణ సేవా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పోచంపల్లి రమణారావు ఆధ్వర్యంలో ఈనెల 29న హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో జరిగే బ్రాహ్మణ సమ్మేళనం వాల్‌పోస్టర్‌ను మంత్రి ఆవిష్కరించి మాట్లాడారు. రాష్ట్రంలోని 33 జిల్లాల్లో బ్రాహ్మణ భవనం నిర్మించుకోవడంపై బ్రాహ్మణ సంఘాలు కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు. ముఖ్యంగా బ్రాహ్మణులు తమ సంఘటిత శక్తి, ఐక్యతతో తమ హక్కులను సాధించుకోవాలని సూచించారు. పోచంపల్లి రమణారావు, వింజమూరి సుధాకర్‌లు మాట్లాడుతూ 29న జరిగే బ్రాహ్మణ సదస్సుకు బ్రాహ్మణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సేవా సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ అవ్వాలక్ష్మి నరసింహారావు, గంగు ఉపేంద్రశర్మ, పవన్‌శర్మ, గోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'మదర్ ఆఫ్ ద సాయిల్' పుస్తకావిష్కరణ


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, పురుషోత్తం నారగోని

చిక్కడపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అసాధ్యం అనుకున్న తెలంగాణ ప్రజల ఆరు దశాబ్దాల ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్ష సోనియాగాంధీ వల్లే సాధ్యమైందని రాష్ట్ర బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్రం సాధనలో సోనియాగాంధీ పాత్రను ప్రతిబింబిస్తూ సీనియర్ జర్నలిస్ట్ పురుషోత్తం నారగోని రచించిన 'మదర్ ఆఫ్ ద సాయిల్' పుస్తకాన్ని మంత్రి పొన్నం ప్రభాకర్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సోనియాగాంధీ తెలంగాణ దేవత అని కొనియాడారు. అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మా సమస్యలు ప్రభుత్వం దృష్టికి తేవాలి


కవితను కలిసిన తెలంగాణ ఆదివాసీ ఎరుకల సంఘం నేతలు

చిక్కడపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): మా సమస్యలు శాసనమండలిలో ప్రశ్నించి ప్రభుత్వం దృష్టికి తేవాలని కోరుతూ తెలంగాణ ఆదివాసి ఎరుకల సంఘం నేతలు శనివారం ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను కలిసి విజ్ఞప్తి చేశారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లోకిని రాజు నాయకత్వంలో పలువురు సంఘం నేతలు కవితను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పందుల పెంపకంపై ఆధారపడి జీవిస్తున్న ఎరుకల కుటుంబాల అభివృద్ధి కోసం ఎరుకల ఎంపవర్‌మెంట్ స్కీమ్, చేవెళ్ల ఎస్టీ డిక్లరేషన్ సభలో ప్రకటించిన ప్రకారం తెలంగాణ వ్యాప్తంగా ఆదివాసి ఎరుకల అభివృద్ధి కోసం ఎరుకల కార్పొరేషన్ ఏర్పాటు అంశాలు కౌన్సిల్‌లో ప్రస్తావించాలని కవితను కోరినట్లు తెలిపారు. ఆమెను కలిసినవారిలో సంఘం ప్రధానకార్యదర్శి కుతాడి రవికుమార్, వర్కింగ్ అధ్యక్షుడు కోనేటి నరసింహ, కోశాధికారి మనం రమేష్, యాదగిరి, శ్రీరాములు, కుమ్మరయ్య, రమేష్, రవి, సతీష్ ఉన్నారు.

10, 11 తేదీల్లో కేరళ సంఘీభావ సభలు

చిక్కడపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): కేరళ ప్రజల హక్కులను రక్షించండి ప్రత్యామ్నాయాన్ని బలోపేతం చేయండి' అనే నినాదంతో దేశవ్యాప్తంగా ఈనెల 10, 11 తేదీల్లో కేరళ సంఘీభావ సభలు, సమావేశాలు నిర్వహించాలని తెలంగాణ రైతు సంఘం, సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘాల రాష్ట్ర కార్యదర్శులు టి.సాగర్, జె.వెంకటేష్, వెంకట్రాములు పిలుపునిచ్చారు. శనివారం ఆర్టీసీ క్రాస్ రోడ్‌లోని తెలంగాణ రైతుసంఘం రాష్ట్ర కార్యాలయంలో కేరళ సంఘీభావ దినం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేరళ ప్రజల హక్కులను అణిచివేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రతీకార చర్యలను తిప్పికొట్టాలన్నారు. ఆయా సంఘాల నేతలు భూపాల్, మూడ్ శోభన్, ప్రొ.అరిబండి ప్రసాదరావు, బి ప్రసాద్, బొప్పని పద్మ తదితరులు పాల్గొన్నారు.

హెబ్రోన్‌చర్చి సమస్యలను పరిష్కరించాలి


మాట్లాడుతున్న రెవరెండ్ మోహన్‌బాబు

ముషీరాబాద్, డిసెంబరు7 (ఆంధ్రజ్యోతి): నగరంలో ప్రసిద్ధిగాంచిన హెబ్రోను చర్చి సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రత్యేక కమిటీని నియమించాలని చర్చి రెవరెండ్లు, బిషప్‌లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం ముషీరాబాద్‌లోని కపీష్ కన్వెన్షన్‌హాల్‌లో హెబ్రోన్ చర్చి సమస్యల అధ్యయన సభను నిర్వహించారు. ఈ సభకు హాజరైన రెవరెండు వై.మోహన్‌బాబు మాట్లాడుతూ.. హెబ్రోన్ చర్చి గొడవకు మూలకారణాలు డబ్బే అని పేర్కొన్నారు. 12 సంవత్సరాల పైగా చర్చికి వచ్చే విశ్వాసకులు సమర్పించిన కానుకలు దోపిడీకి గురయ్యాయని ఆరోపించారు. సీఎం స్పందించి హెబ్రోన్ చర్చి సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో బిషప్ మోజెష్, ఆశీర్వాదం, రెవరెండ్లు డాక్టర్ టి.భాస్కర్, హెడ్‌వర్డ్ రోజ్, ధీరా, సంజయ్, డేవిడ్, సుధాకర్, శ్రీకాంత్, జాన్సన్, హెడ్‌వర్డ్, ప్రసాద్ చౌదరి, బాబూరావు, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న హేమ, రాముగౌడ్, మహ్మద్ మస్జీద్, శివాజీ, శ్రీనివాస్

రేవతి కుటుంబానికి న్యాయం చేయాలి

కవాడిగూడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్ వద్ద పుష్ప- 2 సినిమా ప్రారంభం సందర్భంగా మృతి చెందిన మహిళ కుటుంబ సభ్యులకు 25 లక్షల ర ఊపాయలు ఇవ్వడం ఎంత వరకు సమంజసమని ఆమ్ ఆద్మీ పార్టీ నాయకులు హేమ, రాముగౌడ్, మహ్మద్ మస్జీద్, శివాజీ, శ్రీనివాస్ ప్రశ్నించారు. సినిమా పేరుతో కోట్ల రూపాయలు వసూలు చేశారని వారు ఆరోపించారు. మహిళ ప్రాణానికి 25 లక్షల వెలకట్టారని వారన్నారు. శనివారం లిబర్టీలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఆ కుటుంబానికి న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్దఎత్తున ఆందోళన చేస్తామని వారు హెచ్చరించారు.

చైతన్యకు తెలుగులో ఉస్మానియా పీహెచ్‌డీ


అంబాల చైతన్య

అంబర్‌పేట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట సెంట్రల్ ఎక్సైజ్ కాలనీలో నివాసం ఉండే అంబాల చైతన్యకు తెలుగులో ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. తెలుగు భాష ఆధునీకరణలో తెలంగాణ పత్రికలు వివిధ సంస్థల పాత్ర అనే అంశంపై పాలమూరు యూనివర్సిటీ తెలుగు విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చవ్వా వెంకటరెడ్డి పర్యవేక్షణలో పీహెచ్‌డీ చేశారు. చిన్నతనంలోనే వివాహమైన చైతన్య డిగ్రీ, పీజీలు ప్రైవేట్‌గా చదివి తెలుగులో పీహెచ్‌డీ సాధించడం అభినందనీయమని ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీ ప్రిన్సిపాల్ కాశీం ఆమెను అభినందించారు.

విద్యార్థుల్లో దాగిఉన్న ప్రతిభను వెలికితీయాలి

- రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు 14 మంది విద్యార్థుల ఎంపిక
- జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి


ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైన విద్యార్థులకు సర్టిఫికేట్లు అందజేస్తున్న డీఈవో రోహిణి, చిరంజీవి

ముషీరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో దాగి ఉన్న శాస్త్రీయ ప్రతిభను వెలికితీసి ఆయా రంగాల్లో వారిని మరింత ప్రావీణులుగా తీర్చిదిద్దేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారిణి రోహిణి అన్నారు. శనివారం రాంనగర్ సెయింట్ పాయిస్ హైస్కూల్‌లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన పోటీలకు 14 మంది విద్యార్థులు తయారు చేసిన నమూనాలను ఎంపిక చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా విద్యాశాఖ అధికారి రోహిణి రాష్ట్ర స్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపికైన 14 మంది విద్యార్థులను అభినందించి సర్టిఫికెట్లు, మెమోంటోలు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. జిల్లా స్థాయిలో 150 నమూనాలను ఎంపిక చేయగా రెండు రోజుల పాటు ప్రదర్శన నిర్వహించి ప్రముఖ ప్రొఫెసర్‌లు, శాస్త్రవేత్తలచే రాష్ట్రస్థాయిలో జరిగే ఇన్‌స్పైర్ పోటీలకు ఎంపిక చేశామని అన్నారు. విద్యార్థులు తమ చిట్టిబుర్రలకు పదును పెట్టి మేధావులను సైతం ఆశ్చర్యపరిచేలా ప్రతిభ కనబరిచారన్నారు. ముషీరాబాద్ విద్యామండలి డిప్యూటీ డీఈవోలు చిరంజీవి, సామ్యూల్‌రాజ్, శ్రీధర్, రామకృష్ణ, ఆదిత్య, విజయలక్ష్మి, సోమ్యానాయక్, ఐవోటీఎస్‌లు స్వరూపారాణి, విశ్వనాథ్‌గుప్తా తదితరులు పాల్గొన్నారు.

టీజీపీఈటీఏ రంగారెడ్డి జిల్లా అధ్యక్ష కార్యదర్శుల ఎన్నిక

ముషీరాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ వ్యాయామ విద్య ఉపాధ్యాయ సంఘం (టీజీపీఈటీఏ) రంగారెడ్డి జిల్లా నూతన కమిటీ అధ్యక్ష, కార్యదర్శులుగా ఎం.గోవర్ధన్‌రెడ్డి, డాక్టర్ ఏ.సిద్ధార్థ్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం ముషీరాబాద్‌లో జరిగిన టీజీపీఈటీఏ రంగారెడ్డి జిల్లా నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి సుధాకర్ రెడ్డిలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. వీరి పదవీకాలం రెండు సంవత్సరాలు ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో టీజీపీఈటీఏ రాష్ట్ర కోశాధికారి నాగరాజుగౌడ్, నగర అధ్యక్షుడు పులి కిషోర్, నాయకులు ఇమ్రాన్, కన్వీనర్ గాయత్రిదేవి తదితరులు పాల్గొన్నారు.


సంతోష్‌కుమార్‌ను కలిసి ఎమ్మెల్యే ముఠా గోపాల్

జోగినిపల్లి సంతోష్‌ను కలిసిన ఎమ్మెల్యే ముఠా గోపాల్

చిక్కడపల్లి, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): గ్రీన్‌చాలెంజ్ సృష్టికర్త జోగినిపల్లి సంతోష్‌కుమార్‌ను శనివారం ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈసందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి సంతోష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్‌ఎస్ మీడియా ఇన్‌చార్జి ముచ్చుకుర్తి ప్రభాకర్, పార్టీ నేత శంకర్‌ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉండాలి

ఎంపీ డాక్టర్ కె.లక్ష్మణ్


స్కాలర్‌షిప్ చెక్కును అందజేస్తున్న వీహెచ్

బర్కత్‌పుర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు సెల్‌ఫోన్లకు దూరంగా ఉంటూ విద్యపై ప్రత్యేక దృష్టి సారించాలని రాజ్యసభ సభ్యులు డాక్టర్ కె.లక్ష్మణ్ కోరారు. సెల్‌ఫోన్ల వల్ల అనేక ఇబ్బందులు తలెత్తే ప్రమాదం ఉందని అన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి ఎదిగినప్పుడే తల్లిదండ్రులకు, సహకరించిన ట్రస్ట్‌బోర్డుకు సార్థకత ఉంటుందన్నారు. శనివారం కాచిగూడ మున్నూరుకాపు భవన్‌లో మున్నూరుకాపు విద్యార్థి వసతి గృహం, ట్రస్ట్ బోర్డు ఆధ్వర్యంలో తండ్రి లేని విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు, డిగ్రీ, పీజీ, ప్రొఫెషనల్ కోర్సులలో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఉన్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. మాజీ ఎంపీ వి.హనుమంతరావు ముందుగా జ్యోతి వెలిగించి కార్యక్రమం ప్రారంభించి మాట్లాడుతూ విద్యతోనే సమాజంలో మార్పు వస్తుందన్నారు. ట్రస్ట్ బోర్డు చైర్మన్ ప్రొఫెసర్ మ్యాడం వెంకట్రావ్ అధ్యక్షత వహించగా బి.మహేందర్‌రావు, పన్నాల విష్ణువర్ధన్‌రావు, పిల్లి శ్రీనివాస్‌రావు, నాగేష్ పాల్గొన్నారు.

శృంగేరీ శంకరమఠంలో హరికథా మహోత్సవం ప్రారంభం

రాంనగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): నల్లకుంట శృంగేరీ శంకరమఠం ప్రాంగణంలో హరికథా పితామహ ఆదిభట్ల నారాయణదాస 160వ, నేతి లక్ష్మీనారాయణ భాగవతుల జయంతి సందర్భంగా హరికథా మహోత్సవం శనివారం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి వెంకట కృష్ణయ్య, శ్రీనివాస్, చావలి కామేశ్వరరావు దంపతులు, ఉమాదేవి, శారదలు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. వై.శిఖామణి భాగవతారిణి భక్తప్రహ్లాద హరికథా గానం చేసి భక్తులను మంత్రముగ్ధులను చేశారు. దక్షిణామూర్తి వయోలిన్‌పై, ఆర్.సుధాకర్ మృదంగంపై చక్కటి వాద్యసహకారం అందించారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాల విమర్శలు

కాంగ్రెస్ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్


ఆర్టీసీ డీఎం మంజులకు స్వీట్లు తినిపిస్తున్న తొలుపునూరి కృష్ణగౌడ్, కే.పీ.మురళీకృష్ణ తదితరులు

బర్కత్‌పుర, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తుంటే ఓర్వలేకనే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాని కాంగ్రెస్ పార్టీ ఖైరతాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి తొలుపునూరి కృష్ణగౌడ్ ఆరోపించారు. శనివారం బర్కత్‌పుర ఆర్టీసీ డిపోలో ప్రజాపాలన విజయోత్సవాల సందర్భంగా పార్టీ సీనియర్ నాయకుడు కే.పీ.మురళీకృష్ణ ఆధ్వర్యంలో డీఎం మంజులతో పాటు సిబ్బందికి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రసన్నాంజనేయస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణగౌడ్ మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీలు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేయడం మానుకోకపోతే ప్రజలే సరైన రీతిలో బుద్ధి చెబుతారన్నారు. కాంగ్రెస్ పాలనలో ఆరు గ్యారంటీల అమలు దిగ్విజయంగా కొనసాగుతోందన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తూ మెరుగైన పాలన అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు సీ.హెచ్.మురళీ, ధన్‌రాజ్‌యాదవ్, బండారి కిరణ్, వెంకటేష్, రామయ్య, రాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీఏ విద్యార్థులు అప్‌డేట్ కావాలి


కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ప్రొ. విష్ణుప్రియ, ఏంబీఏ విద్యార్థులు

రాంనగర్: ఎంబీఏ విద్యార్థులు బహుళ ప్రావీణ్యంతో తమను తాము అప్‌డేట్ చేసుకోవాలని, ముఖ్యంగా కృషి, నేర్పుతో విజయం సాధించవచ్చని పలువురు వక్తలు సూచించారు. శనివారం బాగ్‌లింగంపల్లిలోని అంబేడ్కర్ ఇనిస్టిట్యూషన్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ టెక్నాలజీ అంశంపై నూతన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ బిజినెస్ మేనేజ్‌మెంట్ అధిపతి ప్రొఫెసర్ డాక్టర్ జహంగీర్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీలు హాజరై మాట్లాడారు. యువతలో అనుక్షణం ఆలోచన పరమైన విలువలను నిలుపుకుని ముందుకు సాగినప్పుడే నేటి సమాజంలో రాణించగలరని తెలిపారు. కార్యక్రమంలో అంబేడ్కర్ కాలేజీ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ విష్ణుప్రియ, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ అప్పలయ్య మీసాల, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తొక్కిసలాటలో మృతి చెందిన రేవతి కుటుంబీకులకు

రూ.3 కోట్ల నష్టపరిహారం ఇవ్వాలి


సమావేశంలో మాట్లాడుతున్న పి.సాయిబాబా

రాంనగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ క్రాస్‌రోడ్స్‌లోని సంధ్య థియేటర్‌లో కథానాయకుడు అల్లు అర్జున్ పుష్ప-2 సినిమా ప్రారంభం సందర్భంగా మృతి చెందిన రేవతి కుటుంబీకులకు రూ.3 కోట్ల నష్టపరిహారం ఇవ్వాలని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా డిమాండ్ చేశారు. అల్లుఅర్జున్ రాకను రాకను స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వకపోవడం వల్లనే తొక్కిసలాట జరిగి రేవతి మృతి చెందిందని ఆరోపించారు. ఆ మహిళకు అల్లుఅర్జున్ 25 లక్షల రూపాయల ఆర్థిక సాయం ప్రకటించం విడ్డూరంగా ఉందన్నారు. శనివారం పార్టీ నగర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ సదరు కథానాయకుడు ఒక్కో సినిమాకు రెమ్యూనరేషన్ 300 కోట్ల వరకు తీసుకుంటాడని, ఆయన సినిమాకు 20 వేల కోట్ల వరకు కలెక్షన్లను రావాలని పెద్దఎత్తున ప్రచారం చేయడం వల్లనే మహిళ చనిపోయిందన్నారు. భవిష్యత్‌లో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.బాల్‌రాజ్‌గౌడ్, నల్లెల కిషోర్, ఎస్.ప్రకాష్, యాదగిరిరావు, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.


బీజేపీ ఆధ్వర్యంలో సరూర్‌నగర్‌లో నిర్వహించిన బహిరంగసభకు తరలివెళ్లిన అంబర్‌పేట బీజేపీ నేతలు దాసోజు నాగభూషణంచారి, మైలారం రాజు, భిక్షపతి, రాంచందర్‌గుప్తా, దయాకర్‌యాదవ్, పెంటం రాజు తదితరులు

- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

● ఎంపిక


కరీంనగర్ జిల్లా హుస్నాబాద్‌లో జరిగిన అండర్-14 రాష్ట్ర స్థాయి హాకీ పోటీలకు ఎంపికైన అంబర్‌పేట ప్రేమ్‌నగర్ హైమావతి పాఠశాల విద్యార్థులతో కోచ్ అనిత. హాకీ పోటీలకు ఎంపికపై విద్యార్థులకు పాఠశాల ప్రిన్సిపాల్ నిరంజన్ శుభాకాంక్షలు తెలిపారు.

- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

మరమ్మతు


ఎన్‌సీహెచ్ కాలనీలో పనిచేయని చేతిపంపు సమస్యను స్థానికులు అంబర్‌పేట కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్ దృష్టికి తీసుకురాగా స్పందించిన ఆయన శనివారం సంబంధిత అధికారులను పిలిపించి చేతిపంపును బాగు చేయించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు లవంగు ఆంజనేయులు, రంగు సతీష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

- అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి

షాద్‌నగర్ ఎమ్మెల్యేను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలి

ఆలిండియా డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ బ్లైండ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి చొక్కారావు


సమావేశంలో మాట్లాడుతున్న చొక్కారావు తదితరులు

నల్లకుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): వెలమ కులస్థులను కించపరుస్తూ షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్య చేసిన వ్యాఖ్యలు చేయడాన్ని వెలమ సంఘం సీనియర్ నాయకుడు, ఆలిండియా డెవలప్‌మెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆఫ్ బ్లైండ్ తెలంగాణ ప్రధాన కార్యదర్శి పి.చొక్కారావు తీవ్రంగా కండించారు. అన్ని వర్గాల ఓట్లతో విజయం సాధించిన ప్రజాప్రతినిధి తన బాధ్యతను విస్మరించి వెలమ కులంపై వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. ఈ విషయంపై రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశామని, ఎమ్మెల్యే కె.శంకర్ పై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. టీపీసీసీ అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్ సదరు ఎమ్మెల్యేను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని కోరారు. శనివారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చట్టసభల్లో సభ్యులైన ఎమ్మెల్యేలు స్థాయిని పెంచుకునేలా మాట్లాడాలి, అలా కాకుండా అనుచిత వ్యాఖ్యలు చేయడంతో వారి స్థాయిని వారే కించపరుచుకుంటున్నారని ఎద్దేవ చేశారు. వెలమ కులస్థులపై షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకర్ స్థాయికి తగ్గి వ్యవహరించడం శోచనీయమన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు వెలమ కులస్థుల మనోభావాలను దెబ్బతీసినట్లుగా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి మెప్పుకోసం ఎమ్మెల్యే వెలమ కులస్థులపై అనుచిత వ్యాఖ్యలు చేయడం ఎంత వరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. ఒకే కుటుంబం పదవులు పొందడం జరిగిందని మాజీ సీఎం కేసీఆర్, ఆయన తనయుడు మాజీమంత్రి కేటీఆర్, కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవితలపై సీఎం పరుషపదజాలంతో వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. అలా అయితే కాంగ్రెస్ పార్టీలో అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ, రాష్ట్రంలో ఒక కుటుంబం నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు, ఎంపీ స్థానాలు పొంది ఉన్నారని దీనికి ఏం సమాధానం చెబుతారని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లక్ష్మారెడ్డి, పరమేశ్, రాములు తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగులను రాష్ట్ర కమిషనర్‌గా నియమించాలి

- దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు

రాంనగర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దివ్యాంగులను రాష్ట్ర కమిషనర్‌గా, డైరెక్టర్‌గా నియమించాలని దివ్యాంగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు వల్లభనేని ప్రసాద్, వి.భారతిలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం రాంనగర్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దివ్యాంగుల జనాభా 20 లక్షల పైగా ఉందని, వారి హక్కుల సాధనకు చర్యలు తీసుకోవాలన్నారు. దివ్యాంగులు, సకలాంగుల సమాన స్థాయి ఆర్‌పీడబ్ల్యూడీ 2016 చట్టం అమలు చేయకపోవడం అన్యాయమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ అమరుల కుటుంబాలకు ప్రత్యేక పథకం రూపొందించాలి

కవాడిగూడ, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సాధన ఉద్యమంలో అమరులైన ఉద్యమకారుల కుటుంబాలకు ఆర్థిక సాయం అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక పథకం రూపొందించాలని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శనివారం కవాడిగూడలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణ చరిత్రలో డిసెంబర్ 9కి ఎంతో విశిష్టత ఉందన్నారు. రాష్ట్ర సాధన కోసం యువకులు బలిదానాలు చేసుకుంటుంటే సోనియాగాంధీ తెలంగాణ ప్రక్రియ ప్రారంభించారని గుర్తు చేశారు.

11న రాజా లక్ష్మీ నరసింహదాసు ఆరాధన సంగీతోత్సవం

నల్లకుంట, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి): భద్రపీఠం ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీ నుంచి మూడు రోజుల పాటు దివంగత రాజా తూము లక్ష్మీ నరసింహదాసు ఆరాధన సంగీతోత్సవం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు భద్రపీఠం ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షుడు తూము వెంకటరామకృష్ణ తెలిపారు. శనివారం హైదర్‌గూడలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాంకోఠిలోని శ్రీశక్తి గణపతి ఆలయ ప్రాంగణంలో 11వ తేదీ సాయంత్రం 7.02 గంటలకు ప్రముఖ సంగీత విద్వాంసులు కె.వాసుదేవరావు, కె.సాయిసరయు బృందంచే గానకచేరీ ఉంటుందన్నారు. 12వ తేదీన మొహిదీపట్నం గుడిమల్కాపూర్‌లోని ఉమాపార్వతి సమేత త్రయంబకేశ్వరస్వామి, జయదుర్గ, శిరిడీ సాయిబాబా ఆలయ ప్రాంగణంలో సంగీత విద్వాన్ ఐ.సుబ్రహ్మణ్యం, దువ్వూరి ఉషశ్రీ బృందంచే సంగీత కచేరీ ఉంటుందని తెలిపారు. 14న అలకాపూర్‌కాలనీలోని తుల్జారామ్‌బాగ్ ఆలయ ప్రాంగణంలో ప్రముఖ సంగీత విద్వాంసులు మైలవరపు శారద, ఐ.సుబ్రహ్మణ్యం బృందంచే సంగీత కచేరీ ఉంటుందన్నారు. సంగీతాభిమానులు పాల్గొని ఈ ఆరాధనోత్సవాలలో విజయవంతం చేయాలని ఆయన కోరారు.